మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## గర్భిణీని ఆసుపత్రికి తరలించిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు



గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎన్డిఆర్ఎఫ్ బృందాలు

**హవేళిఘనపూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా హవేళి ఘనపూర్ మండలం వాడి గ్రామానికి చెందిన గర్భిణి మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుంది. ఆసుపత్రికి మెదక్ పట్టణానికి ఆటోలో వెళ్లే క్రమంలో బూరుగుపల్లి వద్దకు రాగానే రోడ్డు తెగిపోయింది. దీంతో బూరుగుపల్లి గ్రామం నుండి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు జాగ్రత్తగా ఆమెను ఆసుపత్రికి తరలించారు.

## వరద ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** భారీ వర్షాలతో ప్రజలు అవస్థలు పడకుండా ఉండేందుకు గురువారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇరిగేషన్ అధికారులతో కలిసి వరద ప్రవహిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. సంగారెడ్డిలోని పాయ్‌నీర్ పాఠశాల వెనుకాల గల హస్టల్ గడ్డ శివారులోని వరదనీటితో నిండిపోయిన కుంటను, తెగిపోయిన వంతెనలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న హరీష్‌రావు

## ఆందోళన వద్దు...అప్రమత్తంగా ఉండాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సూచించారు. భారీ వర్షాలతో పట్టణంలో జలమయమైన లోతట్టు ప్రాంతాలతో పాటు కోమటిచెరువు వాగు ఉధృతిని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని..ప్రజలు ఆందోళన చెందొద్దన్నారు. నాలాలు కబ్జాలుచేసి ఇల్లు నిర్మించుకున్నాక వరదలు వస్తే ఇబ్బందులు తప్పవన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఇండ్లు నిర్మించుకోవడం మూలంగా వర్షాలతో వరద నీరు వచ్చి చేరుతుందన్నారు. భారీ వర్షం వలన పట్టణంలో పల కాలనీలు జలమయమైనాయని తెలిపారు. వరద నీటిని తగ్గించడానికి నర్సాపూర్ చెరువుకు ఒక మీటర్ తొలిగించామన్నారు.గతంలో ఎన్నుడూ లేని విధంగా సిద్దిపేట పట్టణంలో 10 సెంటీమీటర్ల వర్షం కురిసిందన్నారు. ఆయన వెంట కమిషనర్ అశ్రిత్ కుమార్, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

## సింగూరుకు 30 టిఎంసిల వరద నీరు



సింగూరు ప్రాజెక్టు దృశ్యం

**పుల్‌కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** వర్షాకాలం మొదలయినప్పటి నుంచి ఇప్పటివరకు సింగూరు జలాశయానికి 30 టిఎంసిల వరద నీరు వచ్చి చేరిందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో 17 టీఎంసిలకు మించకుండా నీటిని నిల్వ చేయాల్సి ఉండటంతో ప్రాజెక్టులోకి అధికంగా వచ్చిన 34 టిఎంసిల నీటిని దిగువకు విడుదల చేస్తూ వస్తున్నారు. ప్రాజెక్టులోకి నీటి ఇన్‌ఫ్లో భారీగా వస్తుండటంతో జలాశయం నాలుగు స్పిల్‌వే గేట్ల ద్వార 40,346 క్యూసెక్కుల నీటిని దిగువకు (మంజీర బ్యారేజ్, ఘనపూర్, నిజాంసాగర్) ప్రాజెక్టులకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. జన్కో గేట్స్ ద్వార 1,986 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో సింగూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం అయింది. తాగునీటి అవసరాల కోసం 150 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టిఎంసిలకు కాను ప్రాజెక్టులో ప్రస్తుతం 17.956 టిఎంసిల నీటి నిల్వ ఉంచారు.

## దుబ్బాకలో అడిషనల్ కలెక్టర్ పర్యటన



రోగులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అగర్వాల్

**దుబ్బాక, ఆగస్టు 28, ప్రభాతవార్త :** జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమఅగర్వాల్ దుబ్బాకలో గురువారం పర్యటించడం జరిగింది. పర్యటనలో భాగంగా వనమహోత్సవం చెట్లను పరిశీలించి, 100 పడకల ప్రభుత్వఆసుపత్రిని తనిఖీచేసి, అటెండెన్స్ రిజిస్టర్‌ను చెక్‌చేయడం జరిగింది. ఆసుపత్రిలో వైద్యం గురించి ఆరాతీసి వైద్యులకు పలుసూచనలు చేశారు. అనంతరం దుబ్బాకలో 15వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. జిల్లాలో దుబ్బాక పట్టణం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వెనకబడి ఉందని, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలు తొందరగా కావడానికి పలు సూచనలు తెలియజేసినారు. దుబ్బాక రామసముద్రం కట్ట పక్కనగల నీరు ప్రవహించడం పరిశీలించారు. వీరి వెంట దుబ్బాక పట్టణ మున్సిపల్ కమిషనర్ కళ్యాణ రమేష్, దుబ్బాక ఎమ్మార్వో సంజీవ్ కుమార్, తదితర సిబ్బంది ఉన్నారు.

## పునరావాస కేంద్రాలను సందర్శించిన ఎంపి

**మెదక్ టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన హవేలి ఘనపూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రాలు మెదక్ పట్టణంలో ఏర్పాటు చేశారు. గురువారం మెదక్ పట్టణంలోని జీకేఆర్ గార్డెన్‌లో పునరావాస కేంద్రాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి తప్పుడు నివేదికలు ఇచ్చారని అన్నారు. సుమారు మెదక్ పట్టణంలోని సబ్ స్టేషన్ నిర్మించడానికి మూడు కోట్లు ఖర్చు అవుతుందన్నారు. కోటి రూపాయల నష్టపరిహారం సరిపోదు అన్నారు. వరద బాధితులతో మాట్లాడి సరైన సమయానికి అన్ని వసతులు కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వరదలు తగ్గి ముఖం పట్టిన వెంటనే మీ మీ గ్రామాలకు పంపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వోల్టాస్ రాధా మల్లేశం, గడ్డం శీను, నాయిని ప్రసాద్, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న మెదక్ ఎంపి రఘునందన్ రావు

# సిద్దిపేటను ముంచెత్తిన భారీ వర్షాలు..

* స్తంభించిన జన జీవనం..నిలిచిపోయిన రాకపోకలు * పొంగుతున్న చెరువులు, కుంటలు
*ఉధృతంగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు, కోమటిచెరువు *వరదనీటిలో వాగుగడ్డపై చిక్కుకున్న ముగ్గురు
*24 గంటల తర్వాత క్షేమంగా తీసుకొచ్చిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం * జలమయమైన లోతట్టు ప్రాంతాలు



సిద్దిపేట పట్టణంలో జలమయమైన శ్రీనగర్ కాలనీ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో సిద్దిపేటజిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు,వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ఇండ్లలోకి, దుకాణాలలోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించడంతోపాటు పలు ప్రాంతాల్లో రాకపోకాలు నిలిచిపోయాయి. అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేటలోని వరద చిన్ననిజాంపేట వైపు ఉధృతంగా ప్రవహించడంలో పొలాలకు వెళ్లిన ముగ్గురు రైతులు 24 గంటలు వాగుగడ్డపై తలదాచుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు వెంటనే సంఘట స్థలానికి చేరుకున్నారు. బాధితులకు అన్నం, నీరు డ్రోన్ ద్వారా పంపించారు. రాత్రింతా బిక్కుబిక్కుమంటు కాలం వెల్లదీశారు. గురువారం ఉదయం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం బోట్‌ల ద్వారా వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలోని కూడవెల్లివాగు ఉధృతంగా ప్రవహిస్తుడడంతో పంట పొలాలోకి వరదనీరు చేరి తీరని నష్టం వాటిల్లింది. సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, భారత్‌నగర్,హరిప్రియ నగర్, శ్రీనివాస్‌నగర్, పాత బస్టాండు టూ హైదరాబాద్ రోడ్డు పూర్తిగా జలమయంకావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వరదనీటితో పాత బస్టాండు జలమయం కావడంతో ప్రయాణీకులు ఇబ్బందులుపడ్డారు. ఆయా ప్రాంతాల్లోని అపార్టుమెంటుల్లోకి వరదనీరు వచ్చి చేరింది. హైదారాబాద్ రోడ్డులోని బావిస్‌ఖాన్‌పూల్ నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. తొగుట మండలం చందాపూర్ తదితర గ్రామాల్లోకి వరద నీరు ఇండ్లలోకి వచ్చి చేరింది.

**వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, సీపీ**

జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వరద ప్రభావిత ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కె.హైమావతి, సీపీ డాక్టర్ బి.అనురాధ గురువారం పరిశీలించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగు సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి జిల్లాలో ఎక్కడా ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఓ అపార్టుమెంటు నీట మునగడంతో ప్రాంతాన్ని కలెక్టర్, సీపీలు పరిశీలించి బాధితులను ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కోమటిచెరువు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఇబ్బందుల జరగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పట్టణంలోని నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించి నీరు చెరువుల్లోకి పంపేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే తొగుట, గజ్వేల్ మండలాలలో వారు పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని అధికారులను, ప్రజలకు సూచించారు. అలాగే కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో వారు పరిశీలించారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా చూడాలని ఎన్‌ఆర్‌డిఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎసిపి రవీందర్‌రెడ్డి, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



వరద నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ



చిన్ననిజాంపేట వాగుగడ్డకు చేరుకున్న బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు



సిద్దిపేటకు చేరుకున్న ఎన్‌ఆర్‌డిఎఫ్ బృందాలు

# జల ప్రళయం- ఇబ్బందుల్లో ప్రజలు

**హవేళిఘనపూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మెతుకు సీమ జల దిగ్బంధంలో చిక్కుకుంది. చరిత్రలో ఎన్నడూ లేని రికార్డుస్థాయిలో కురిసిన భారీ వర్షానికి జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. రెండు జిల్లాల సరిహద్దులోఉన్న గిరిజన తండా జలదిగ్బంధంలో చిక్కుకోగా.. చెరువు, వాగులు, కుంటలు కట్టలు తెంచుకొని విలయం సృష్టించి గ్రామాల రాకపోకలను నిలిచిపోయేలా చేసింది. మెదక్ జిల్లా చరిత్రలో ఎన్నడూ కురవని రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. మెదక్, కామారెడ్డి జిల్లాలో 20 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లా సరిహద్దులో ఉన్న ధూప్‌సింగ్ తాండా జల దిగ్బంధంలో చిక్కింది. ఇళ్లల్లోకి నీళ్లు రావడంతో గిరిజనులు ప్రాణ భయంతో స్లాబ్‌ల పైకి వెక్కి సహాయం కోసం గొంతెత్తే పరిస్థితి కలిగింది. భారీ వర్షాలకు నాగాపూర్ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. హవేళీఘనపూర్ బీ తిమ్మాయిపల్లి చెరువు ఉధృతంగా పారి గ్రామంలోకి చేరడంతో స్థానికులు సురక్షితం ప్రాంతాలకు చేరుకున్నారు.బ్యాతోల్ గ్రామానికి ఇరువైపుల నీటి ప్రవాహం వల్ల ఊరు జలదిగ్బంధంలో చిక్కి వేరే ప్రాంతానికి వెళ్లే పరిస్థితిలేదు. నాగాపూర్ నక్క వాగులో ఒక కారు నీటిలో కొట్టుకుపోయింది. ఒడ్డున ఉన్నవారు నీటిలో నుంచి కారును తీసే ప్రయత్నం చేశారు.అందులో ఉన్నవారు ఎవరు అనేది ఇంకా తెలియ లేదు. వర్షం బీభత్సానికి నిజాంపేటలో పది వేల కోళ్ళ మృత్యువాతపడ్డాయి.

రామాయంపేట, మెదక్ పట్టణాల్లో పలు కాలనీల్లో నీరు రావడంతో అపార్ట్‌మెంట్‌లో ఉండే వారు బయటకు రాలేని విధంగా నీరు ప్రవహిస్తుంది. జిల్లాలోఉన్న చెరువులు, కుంటలు స్థాయికిమించి ప్రవహి స్తున్నాయి. హవేలీఘనపూర్ పెద్దచెరువుకు గండి పడడం తో నీరు ప్రమాదకరంగా పారుతుంది. గ్రామస్తులు అప్ర మత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు.



తెగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి వివేక్, ఎమ్మెల్యే రోహిత్,కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రమాదకరంగా పోచారం ప్రాజెక్ట్ ప్రవాహం...**

రెండు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల పోచారం ప్రాజెక్ట్‌కు భారీస్థాయిలో నీరు రావడంతో ప్రాజెక్ట్ ఎత్తు కంటే అధికంగా నీరు ప్రవహిస్తుంది. డ్యామ్ పక్కన ఉన్న గట్టు పైనుంచి నీరు ప్రవహించడంతో స్థానిక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగూర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరద నీరు వస్తుండడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. కానీ భారీస్థాయిలో సింగూర్‌కు నీరు వస్తుండడం పై ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.

**మంత్రి వివేక్ పర్యటన...**

వర్షాలకు అతలాకుతలం అయిన హవేళీఘనపూర్ మండలాన్ని మంత్రి వివేక్, ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడానికి విపత్తు నిర్వహణ, ఆర్మీ బృందాలు రంగంలో ఉన్నాయన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు, వంతెనలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. బాధితలను అన్ని రకాలుగా ఆదుకుంటామని ఆయన బరోసానిచ్చారు.

**హనుమంతరావు భరోసా...**

జలదిగ్బంధంలో చిక్కిన దూప్‌సింగ్ తాండా గిరిజనులకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు భరోసా కల్పించారు. బుధవారం జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావుతో కలిసి జలదిగ్బంధం లో చిక్కిన దూప్ సింగ్ తాండా వరకు వెళ్ళారు. ఒడ్డున ఉంది ఫోన్ లో గిరిజనులతో మాట్లాడారు. సీఎం దృష్టికి విషయం తీసుకు వెళ్లమని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. చాప్టర్ రావడంకు వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల రావడం లేదని, ఇతర అధికారులు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వారికి భరోసా కల్పించారు.

**ఎమ్మెల్యే పర్యటన...**

మెదక్‌లో వర్షానికి నీట మునిగిన కాలనీల్లో మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ పర్యటించి సహాయక చర్యలు అందించాలని అధికారులు ఆదేశించారు. భారీ వర్షాల వల్ల జలమేమైన ప్రాంతాల్లో త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు.

# వరద బాధితులను ఆదుకుంటాం

### నిజాంపేట, రామాయంపేటలో... వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన

**రామాయంపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త :**
మెదక్ జిల్లాలో రామాయంపేటలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయక చర్యలను చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలవల్ల రామాయంపేట జలదిగ్బంధంలో చిక్కుకుందన్నారు. భారీ వర్షాలలో చిక్కుకున్న 60 మందిని జిల్లా డిజాస్టర్ యంత్రాంగం, రెవెన్యూ, పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కాపాడారని చెప్పారు. ఇద్దరు గల్లంతయ్యారన్నారు. వరదల్లో కొట్టుకుపోయిన ఒకరి మృతదేహం లభించిందని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అప్రమత్తతో ఉందన్నారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కాపాడే పనిలో నిమగ్నమై ఉన్నారని పేర్కొన్నారు. వరద ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మంత్రి టెలిఫోన్లో సమీక్షించారు. గత 50 ఏళ్లలో ఇంతటి భారీ వర్షాలను చూడలేదని స్థానిక ప్రజలు మంత్రి తెలిపారు.



రామాయంపేటలోని కామారెడ్డి రోడ్‌లో ఉన్న బీసీ కాలనీ

నీట మునిగిన ఇళ్లను వరద ఉధృతిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరిశీలించారు. రామాయంపేటలోని వరద ప్రభావిత ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలను మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.లోతట్టు ప్రాం తాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి నిత్యవసర వస్తువులను భోజనాలను బట్టలను బెడ్ షీట్లను అందజేయాలని మంత్రి దామోదర్ రాజ నర్సింహ రెవెన్యూ అదికారులను ఆదేశించారు. నిజాంపేట మల్కచెరువు, కోనాపూర్, నందిగామ రోడ్డులో దెబ్బతిన్న బ్రిడ్జి, సాయి చెరువు అలుగులను క్షేత్ర స్థాయిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. వచ్చే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలు రెవెన్యూ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బందికిసహకరించాలని మంత్రి ప్రజలకు సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలని సూచించారు. దెబ్బతిన్న ఇళ్లు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు. జననష్ట జరగకుండా నష్ట నివారణ చర్యలను చేపడుతున్నామన్నారు. దెబ్బతిన్న రోడ్లను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం అంశాలను రెవెన్యూ యంత్రాంగం అంచనాలు రూపొందిస్తున్నారన్నారు. రామాయంపేట, కామారెడ్డి, మెదక్‌లలోని కొన్ని మండలాలలో, ప్రాంతా లలో సుమారు 200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది అన్నారు.



నిండు కుండలా మారిన చౌటకూరు నాయిని చెరువు

### 3 దశాబ్దాల తర్వాత నిండుకుండలా నాయిని చెరువు

**చౌటకూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మూడు దశబ్దాల తర్వాత చౌటకూరులోని నాయినిచెరువు నిండుకుండలా వరదనీటితో నిండుకుపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నాయిని చెరువులోకి వరద నీరు చేరుకోవడంతో చెరువు అలుగు పారుతోంది. అలుగు పారుతుండటంతో ప్రజలు, రైతులు వీక్షిస్తూ 36 ఏళ్లయింది ఇలా చెరువు పారి అని చర్చించుకుంటున్నారు. చెరువులో నీటిమట్టం గరిష్టానికి చేరుకోవడంతో పొలాల్లోకి వరద నీరు చేరుకోవడంతో పంట నీటి పాలయింది.

### మండలంలో భారీ వర్షం



సామ తండాకు పాల క్యాన్‌ను మోసుకుపోతున్న యువకులు

**నాగల్‌గిద్ద, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆయాగ్రామాలు తడిసిపోయాయి. మండలపరిధిలోని సకృతండా నుంచి సామతాండకు వెళ్లే రోడ్డుపై అలుగు పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మండలంలోని గౌడ్ జన్వాడ శివారులో మంజీర నిండు కుండలా ఉధృతంగా ప్రవహిస్తోంది. మండల పరిధిలోని ఎసిగి గ్రామంలో చెరవు నిండా నిండి రహదారిపై ప్రవహిస్తుండటంతో ప్రజలు పరేషాన్ అవుతూ ప్రయాణం చేయాల్సి వచ్చింది. మండలంలోని షాపూర్, కారముంగి, ఔదాపూర్ తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న పంటలు నీట మునిపోయాయి.

### వర్షాలకు కూలిన ఇళ్లు..తెగిన రోడ్లు, చెరువులకు గండ్లు



నీలకంటిపల్లిలో బీటి రోడ్డు తెగిపోయిన దృశ్యం

**అల్లాదుర్గం, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోగా బీటిరోడ్లు తెగిపోయాయి. పలు గ్రామాల్లోకి చెరువులకు గండిపడి నీరు పంట పొలాల్లోకి చేరుకోవడంతో రైతులు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అల్లాదుర్గం నుంచి 161వ జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు మధ్యన బీటిరోడ్డు తెగిపోయింది. అల్లాదుర్గంనుంచి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు పాట్లుపడాల్సి వస్తోంది. అటుగా ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. మండలంలోని సీతానగర్ నుంచి జాతీయ రహదారి వరకు మధ్యలో బీటి రోడ్డుపై నుంచి పెద్ద ఎత్తున వరద నీరు పారడంతో మూడురోజులుగా ప్రజల రాకపోకలు స్థంబించిపోయాయి. నీలకంటపల్లి గ్రామం సమీపంలోని బిటిరోడ్డు వరద నీటికి కొట్టుకుపోయింది. వరద ఉధృతి అధికంగా ఉండటంతో గ్రామం నుంచి ఇతర గ్రామాలకు ప్రయాణాలు ఆగిపోయాయి. మండలంలోని ప్రతి గ్రామం వర్షాలకు అల్లాడుతున్నాయి. పలు గ్రామాల్లోని ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అల్లాదుర్గంలో చాలా ఇండ్లు కూలిపోవడంతో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ప్రతి వాడలలో పర్యటించి ప్రజలకు జాగ్రత్తలు చెబుతున్నారు.

### సింగూరు ప్రాజెక్టును సందర్శించిన సిఐ



సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిఐ అనిల్‌కుమార్

**పుల్‌కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టును గురువారం జోగిపేట సిఐ అనిల్‌కుమార్ సందర్శించారు. ప్రాజెక్టు 4 గేట్లుఎత్తి దిగవకు వదులుతుండటంతో పర్యాటకులను అనిమతించడంలేదు. ప్రాజెక్టు కుడి, ఎడమవైపున మునిపల్లి, పుల్‌కల్ పోలీసులు ఏర్పాటుచేసిన చెక్ పోస్టులను సిఐ తనిఖీచేశారు. ప్రాజెక్టులో నీటిప్రవాహాన్ని నీటిపారుదల ఏఈ శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. సిఐ వెంట పుల్‌కల్ ఎస్ఐ విశ్వజన్ ఉన్నారు.

### మల్లన్న దేవాలయంలో వేలం పాట

**కొమురవెల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం తలనీలాలు గురువారం ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఏడాదికి గానూ రూ. 1,01,01,116 వేలంపాటలో పాల్గొని సిద్దిపేట రుద్ర ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకున్నట్లు తెలిపారు. ఎల్లమ్మ దేవాలయం వద్ద కొబ్బరికాయలు విక్రయించుకునే లైసెన్స్ కోసం టెండర్ దారులు పాల్గొనకపోవడంతో సదరు వేలం పాటను వాయిదా వేసినట్లు ఈవో వివరించారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మీ, ఎఈవో బుద్ది శ్రీనివాస్, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సురేందర్, శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వర్షాలకు నీట మునిగిన పంటలు

**హత్నూర, ఆగస్టు 28, ప్రభాతవార్త :** భారీ వర్షాలతో హత్నూర మండలంలోని పంటలకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు. మంజీరానది ఉధృతంగా ప్రవహించడంతో పరివాహక గ్రామాలు హత్నూర, రెడ్డి ఖానాపూర్ నవాపేట, పన్యాల, బడంపేట, లింగాపూర్ తదితర గ్రామాల పరిధిలోని పత్తి పంటలు వరి చేనులు ఇతర పంటలు నీరు చేరి నష్టం జరిగిందని ఆయ గ్రామాల రైతులు పేర్కొంటున్నారు పరివాహక గ్రామాలలోని లోతట్టు ప్రాంతాలలోని పంటలకు నష్టం జరిగిందని, సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని పంట నష్టపోయిన గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు.



నీటి మునిగిన పత్తి చేను

# పొంగిన ఊర చెరువు.. రహదారిపైకి చేరిన నీరు

**-కబ్జాకు గురైన చెరువు కింద కాలువలు**

**-అప్రమత్తమైన అధికారులు**



రోడ్డుపై చేరిన నీటిని జెసిబితో తొలగిస్తున్న అధికారులు

**గజ్వేల్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఊర చెరువు నిండి పొంగి ప్రధాన రహదారిపై ప్రవహించడంతో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. బుధవారం ఉదయం నుండి రాత్రి వరకు కురిసిన భారీ వర్షం కారణంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఊర చెరువు నిండి జలకల సంతరించింది. భారీగా నీరు రావడంతో గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్ళి చేపలు పట్టడంతో పాటు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా ఊర చెరువు కింద పట్టణానికి చెందిన ఓ బడా నాయకుడు సుమారు 7 ఎకరాలలో వెంచర్ ఏర్పాటుచేసి చెరువు కింద కాలువలు కబ్జా చేశారు. చెరువు కింద కాలువలు లేక పోవడంతో చెరువు మత్తడి దూకినప్పుడల్లా ఇటు గ్రామంలోకి అటు ప్రధాన రోడ్డు పైకి నీరు రావడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డుపై నుండి నీటిని తరలించేందుకు అధికార యంత్రాంగం అంతా శ్రమించి నీరును తరలించినప్పటికీ రోడ్డుకు కుడిభాగంలో కాలువలు లేక రోడ్డుపైనే నీరు నిలిచిపోయింది. నీరు ఎక్కడికి తరలించాలో తెలియక అధికారులకు తల పట్టుకునే పరిస్థితి నెలకొంది. ప్రజ్ఞాపూర్ శివాలయం రోడ్డులో చెరువు నిండి నీరు రావడంతో అక్కడ ఉన్న ఆసుపత్రికి వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. గతంలో చెరువు కింద కాలువలు ఉన్నప్పటికీ వాటిని మూసివేసే సరికి నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ వెళ్లే రోడ్డులో డ్రైనేజీ కట్ చేసి నీటిని తరలించడంతో అక్కడఉన్న రైతుల పంటలు నీట మునిగాయి. రహదారిపైకి భారీగా నీరు రావడంతో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, గజ్వేల్ ఏసిపి నర్సింహులు, స్థానిక సిఐ రవి కుమార్, ముత్యంరాజులు నీటిని తరలించేందుకు సిబ్బందితో పనిచేయించారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు..మొద్దు నిద్రలో ప్రభుత్వం

**బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో భారీ వర్షాలుపడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గురువారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల అసమర్థ విధానాల వల్ల రైతులకు సకాలంలో యూరియా అందక పోవడం, భారీ వర్షాల వల్ల చెరువులకు గండ్లు పడటం, వరి, పత్తి, మొక్కజొన్న పంటలు పెద్దఎత్తున నష్టపోవడం జరిగిందన్నారు. నరపభుత్వం పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.25వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు యూరియా దొరకక వర్షంలో సైతం యూరియా కోసం రైతులు భార్య పిల్లలతో లైన్‌లో నిలబడి తడిసి ముద్దవుతున్నారన్నారు. రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రైతులకు యూరియా అందించే విషయంలో, అధిక వర్షాలు పడే విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులకు సయోధ్యలేకుండా ఎవరికి నచ్చిన స్టేట్మెంట్లు వారు ఇవ్వడంవల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ల ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వరద బాధితులకు, వరదల్లో చిక్కుకున్న వారిని, పంటలు నష్టపోయిన వారిని కలిసి వారికి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, వివిధ మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు, వెంకట్‌రెడ్డి, దేవి రవీందర్, ఊడెం కృష్ణారెడ్డి, ఖాజా విరాసత్‌అలీ, యూత్ వింగ్ రాష్ట్ర నాయకుడు జుబేర్‌పాషా, మంగమ్మ రాంచంద్రం, పంగ మల్లేశం, లతా రమేష్‌గౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, జిల్లా యువజన అధ్యక్షుడు దేవగనిక నాగరాజు, మాజీ కౌన్సిలర్లు మర్కంటి వరలక్ష్మి కనకయ్య, బొగ్గుల చందు, నాయకులు నర్సింగరావు, అహ్మద్, యువజన విభాగం అధ్యక్షుడు స్వామిచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ**

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో సరైన వైద్యం చేయడానికి పూర్తిస్థాయిలో వైద్యులు, మందులు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రజలు సకాలంలో ఉపయోగించుకొని ఆరోగ్యమైన జీవితం కొనసాగించుకోవాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ సూచించారు. గజ్వేల్‌లో ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కువరోజులు జ్వరంతో బాధపడితే వెంటనే జిల్లా ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని, వెంటనే జిల్లా ఆసుపత్రిలో వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. విషజ్వరాలతో అడ్మిట్ అయిన రోగులు డ్యూటీ డాక్టర్ల పట్ల గాని, ఏవైనా ఇతరత్రా ఇబ్బందులు ఉంటే తనను సంప్ర దించాలని, ప్రతి వ్యక్తి వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ రాము, ప్రణతి, జయశ్రీ తదితరులు ఉన్నారు.

### పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ల జాబితా

**-30వ తేదీలోగా అభ్యంతరాలు తెలపాలి**

**పుల్‌కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని 34 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గురువారం పంచాయతీ కార్యదర్శులు వార్డుల వారిగా ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రదర్శించారు. పంచాయతీలోని ఓటరుకు ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉందో జాబితాలో పేర్కొన్నారు. పుల్‌కల్ మండలంలోని 19 గ్రామ పంచాయితీలు ఉండగా ఆయా పంచాయితీలలో 172 వార్డుకు 172 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో 23340మంది ఓటర్లు (పురుషులు 11291, మహిళలు 12049) ఉన్నారు. చౌటకూరు మండలంలో 15 గ్రామ పంచాయితీలలో 134 వార్డులు, పోలింగ్ కేంద్రాల్లో 17706 మంది ఓటర్లు (పురుషులు 8577, మహిళలు 9128, ఇతరులు ఒకరు) ఉన్నారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వ తేదీలోగా లిఖిత పూర్వకంగా ధరఖాస్తు చేసుకోవాలని పుల్‌కల్, చౌటకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఆనందమేరీ, కె శంకర్, ఎంపిఓ వెంకటేశ్వర్‌రెడ్డిలు తెలిపారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

### అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 28, ప్రభాతవార్త :** విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపడతామని, రాష్ట్రంలో ఉచిత విద్యుత్ విద్యుత్ పోరాట అమరవీరుల ఫలితమే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కా రాములు అన్నారు. గురువారం కిషన్ భవన్‌లో అమరవీరుల 25వ వర్ధంతి ని నిర్వహించారు. విద్యుత్ పోరాట మృతవీరులు విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ ల చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో చుక్క రాములు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, రాజయ్య, శివ కుమార్, బాలరాజు, ప్రవీణ్, విఠల్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ ఆధ్వర్యంలో...**

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 28, ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. గురువారం సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి. మహబూబ్ ఖాన్, కాశీనాథ్ శంకర్ నరేష్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు



వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న హరికృష్ణ, అత్తు

### ప్రజలు ఆందోళన చెందొద్దు

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ**

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 28, ప్రభాతవార్త :** సిద్దిపేట నియోజకవర్గంలో వరద ప్రభావితానికి గురైన ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అండగాఉంటుందని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. భారీ వర్షాలతో సిద్దిపేటలో జలమయమైన శ్రీనగర్ కాలనీ, బారఇమామ్, కొత్తబస్టాండులో ఆయన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు)తో కలిసి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ఆయన వాటర్ క్యాన్లను, ఆహారప్యాకెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదల వల్ల పట్టణంలో, నియోజకవర్గంలో జరుగుతున్న నష్టం, ప్రజలు పడుతున్న ఇబ్బందులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు వరదలతో ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ పాలకవర్గం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రజలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దన్నారు. పట్టణంలో మ్యాన్‌హోల్స్ పొంగుతుండడంతో పిల్లలు బయటకు రావొద్దన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాల యంలో హెల్ప్ లైన్ నంబరు ఏర్పాటు చేశామని అత్యవసరం ఉంటే వెంటనే 9701221670కు కాల్ చేసి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, అర్షద్, వాహబ్, మహిపాల్‌రెడ్డి, ఎర్ర మహేందర్, రాజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వంశీ, మల్లేశం, రజని తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో కొలువు దీరిన గణనాథుడు

**సిద్దిపేట రూరల్/కొమురవెల్లి, ఆగస్టు 28, ప్రభావార్త :** జిల్లాలోని ఊరువాడల్లో నవరాత్రోత్సవాలలో భాగంగా బుధవారం గణనాథుడు కొలువు దీరాడు. వినాయకమండపాలను నిర్వాహకులు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వినాయక మండపాలు చూపరులను ఎంతగానో అకట్టుకుంటున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా కొలువు దీరిన గణనాథుడు నిత్యాపూజలందకుంటున్నారు. గణనాథుడికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక మండపాలు భక్తి పాటలు, గీతాలతో దద్దరిల్లుతున్నాయి.

**కొమురవెల్లిలో...**

మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో గణనాథున్ని ప్రతిష్టించారు. దీంతో గణనాథుడు నిత్యపూజలు అందుకుంటున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పాఠశాల విద్యార్థులు, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు,సురేందర్, ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున్, అర్చకులు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఝరాసంగం మండలంలో...**

**ఝరాసంగం, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితిని పురస్కరించుకుని వినాయకులను ప్రతిష్టించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ నవ రాత్రి ఉత్సవాలకు భక్తులు తెలిపారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల, ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో విఘ్నేశ్వరుడిని ప్రతిష్టించుకుని పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు చేరుకున్న భక్తులు తీర్థప్రసాదాలు అందచేశారు.

**నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...**

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 28, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో నాయీబ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపం వద్ద గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ సభ్యులు, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### మీర్జాపూర్‌లో ఇళ్లల్లోకి వరద నీరు

**ఆదుకున్న రెవిన్యూ అధికారులు**

**న్యాల్‌కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలో రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇంట్లోకి వరద నీరు చేరుకోవడంతో అవస్థలు పడ్డ వరద బాధితులను రెవిన్యూ అధికారులు ఆదుకున్నారు. గ్రామానికి చెందిన మాలను బీ నివాసం ఉంటున్న ఇంట్లోకి వరదనీరు చేరుకోవడంతో పడరాని పట్లు పడాల్సి వచ్చింది. మాలను బీ కుటుంబ వరదతో అవస్థలు పడ్డట్లు తెలుసుకున్న తహసీల్దార్ ప్రభులు సూచనలమేరకు ఆర్ఐ శ్యామ్‌రావు గ్రామానికి చేరుకుని మాలాను బీ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులను గ్రామంలోని పంచాయితీ కార్యాలయానికి తరలించి(తాత్కాలికంగా నివాసం ఉండేందుకు) భోజనానికి అవసరమైన సామాగ్రి, కొంత నగదును అందచేశారు.

### మంజీరా నదిలో మహిళ గల్లంతు

కొల్చారం, ఆగస్టు 28(ప్రభాతవార్త): మంజీరా నదిలో మహిళ గల్లంతైన సంఘటన మంగళవారం సాయంత్రం తుక్కాపూర్ శివారులో జరిగింది. ఎస్ఐ అహ్మద్ మోహియుద్దీన్ కథనం ప్రకారం... తుక్కాపూర్ గ్రామానికి చెందిన టేక్మాల్ ప్రమీల(65) అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఆమె కుమారుడు టేక్మాల్ నరేందర్ సమయానికి టాబ్లెట్స్ వేసుకోవడంలేదని తల్లిని మందలించాడు. ఆ తర్వాత బయటికి వెళ్తున్నానని ఆమె ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోవడంతో గ్రామంలో, బంధువుల వద్ద కుటుంబ సభ్యులు ఆరా తీశారు. అయినా ఆమె ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం తుక్కాపూర్ బ్రిడ్జి వద్ద ఆమెకు సంబంధించిన వస్తువులు దొరికాయి. కుటుంబ సభ్యులు ఆమె మంజీరా నదిలో గల్లంతు అయిందని బుధవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతురాలి కుమారుడు నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# వర్ష బీభత్సం - జనజీవనం అస్తవ్యస్తం

**చిన్నశంకరంపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** బుధవారం తెల్లవారుజాము నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చిన్నశంకరంపేట మండలం మొత్తం అస్తవ్యస్తమైంది. చాలాగ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నశంకరంపేట,సూరారంలో ఉదయం సమయంలో ట్రాన్స్ఫార్మర్పై పిడుగు పడడంతో సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే చిన్నశంకరం పేటలోని బీడీ కాలనీలో ఉన్న ట్రాన్స్ఫార్మర్పై పిడుగు పడటంతో పట్టణంలో సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సూరారం-ధర్పల్లి మార్గంలో నిర్మిస్తున్న వంతెన వద్ద వరద ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చందాపూర్-జంగరాయ్, చిన్నశంకరంపేట-మిర్జాపల్లి, గజగట్లపల్లి-మాందాపూర్, రుద్రారం-చందంపేట, చిన్నశంకరంపేట-కామారం, ధర్పల్లి-ఉప్పులింగాపూర్ గ్రామాలలో ఉన్న బ్రిడ్జిలపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మడూర్, అంబాజీపేట, గజగట్లపల్లి, కామారం, మాందాపూర్, రుద్రారం, శాలిపేట ఆయా గ్రామాలలోని చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. శాలిపేటలోని నల్లచెరువుకు బుంగపడడంతో అధికారులు ఆ బుంగను పూడ్చి వేయించారు. చందాపూర్‌లో నివాస గృహాలు కూలిపోయిన వారిని గ్రామ పంచాయతీకి తరలించి వారికి పునరావాసం కల్పించినట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. ఖాజాపూర్ గ్రామంలో మహమ్మద్ అలీమ్ ఇల్లు వర్షానికి కూలిపోయింది. మాందాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ లోతట్టు ప్రాంత ప్రజలను గ్రామపంచాయతీకి తరలించారు. సూరారంలో ఒక నివాస గృహం కూలిపోయింది.



చందాపూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో



మెదక్‌వెళ్లేరహదారులు వంతెనపైనుండి ప్రవహిస్తున్న వరద



రుద్రారం,చందంపేట రహదారులు వంతెన పైనుండి పారుతున్న వర్షపు నీరు



అంబాజీపేట శివారులో నీట మునిగిన పంట పొలాలు



రుద్రారం శివారులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

## మండలంలో ఓటర్ల జాబితా ప్రదర్శన

**మనూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

ముసాయిదా ఓటరు జాబితాను మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలంలోని ఆయాగ్రామాల్లోని పంచాయితీ కార్యాలయాల్లో పంచాయితీ కార్యదర్శులు గురువారం ప్రదర్శించారు. ఓటరు జాబితాలో ఏవైన అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వ తేది లోపు సరి చేసువచ్చన్నారు. సెప్టెంబరు 2న ఓటర్ తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు.

## వార్డుల వారీగా ఓటర్ల జాబితా

**కంది, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

మండలంలోని ఆయా గ్రామాల్లోని 212 వార్డులకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శులు గురువారం పంచాయితీ కార్యాలయాల్లో, మండలపరిషత్ కార్యాలయంలో ప్రదర్శించారు. మండలంలో 37823మంది ఓటర్లు ఉండగా, పురుషులు 18616 మంది, మహిళలు 19181, ఇతరులు 26మంది ఉన్నారు. ప్రదర్శించిన ఓటరుజాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వ తారీకు వరకు లిఖితపూర్వకంగా పేర్కొనవచ్చన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి-తహసీల్దార్

**నాగల్‌గిద్ద, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

మండలంలోని ఆయా గ్రామాల్లో కురుస్తున్న భారీ వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ శివకృష్ణ సూచించారు. గ్రామాల శివారులోని వాగులు, కుంటలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయని, సరదాగా కోసం పొర్లుతున్న వాగుల వద్దకు ప్రజల వెళ్లవద్దన్నారు. అత్యసరం అయితేనే కాని ప్రజలు గ్రామం దాటవద్దన్నారు. అత్యవసరం అయితే ప్రజలు 100కు ఫోన్ చేయాలన్నారు. సమస్యలు ఎదురైతే 7093086087కు కాల్ చేయాలని మండల ప్రజలకు తహసీల్దార్ శివకృష్ణ సూచించారు.

## ఓటర్‌జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 30లోగా దరఖాస్తు చేయాలి

**జోగిపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

ఈ నెల 30లోగా ఓటర్ల జాబితాలో సవరణలకు లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని అందోలు ఎంపిడివో రాజేష్ ఒక ప్రకటనలో కోరారు. గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలమేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను గ్రామాల్లో ప్రచురించినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఓట్లకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే, వాటిని గ్రామ కార్యదర్శికి లేదా మండల పరిషత్ కార్యాలయంలో వ్రాత పూర్వకంగా దరఖాస్తు చేయాలన్నారు.

## ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి..

**-జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానందంగౌడ్**



విలేకరులతో మాట్లాడుతున్న అధికారులు

**చిలిపిచెడ్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానందం గౌడ్ అన్నారు. గురువారం తాహసిల్దార్ కార్యాలయంలో పత్రిక సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని, పాక్షికంగా ఇళ్లు కూలినట్లయితే వెంటనే పంచాయతీ కార్యదర్శికిగాని, తహసీల్దార్‌కుగాని సమాచారమీయాలన్నారు. మండలంలో చిట్కుల్, ఫైజాబాద్, చండూర్ గ్రామాలలో పాక్షికంగా ఇళ్లుకూలినవారిని గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలించమని, చండూరులో దూదేకుల షాహిన్‌బేగం, ఫైజాబాద్‌లో కమ్మరి రాములు ఇళ్లు పాక్షికంగా వర్షానికి కూలిపోయాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సహదేవ్, ఎంపిడివో ప్రశాంత్, ఎస్సై నర్సింలు, ఇన్చార్జి ఎంపిఓ తిరుపతి పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**కొండాపూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.దశరథ్ అన్నారు. గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోతున్న, రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని గురువారం మండల కేంద్రమైన కొండాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.దశరథ్ మాట్లాడుతూ భారీవర్షానికి వరదలతో పంట నష్టం జరిగిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. వర్షాకాల సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో సదాశివపేట నుండి అనంత సాగర్, మారెపల్లి, గంగారం, సైదాపూర్ రోడ్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయని, మండలంలో చాలా రోడ్లు పూర్తిగా పాడై ప్రజలు నడవడానికి వీలు లేకుండా అయ్యాయి. రోడ్డులకు వెంటనే మారమ్మతులు చేయాలన్నారు. వరి, పత్తి, మొక్క జొన్న, కూరగాయలు, తదితర పంటలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి సరైన పరిహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు.

## ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా

**-ఎంపిడివో సత్తయ్య**

**కొండాపూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లాస్థాయిలో రాజకియ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్11(4)లో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం, అర్హత తేదీ 01.07.2025 గ్రామ పంచాయతీల ఎలక్టోరల్ రోల్స్ తయారీ, ప్రచురణ గ్రామ పంచాయతీల ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాల తయారీ, గ్రామ పంచాయతీ, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు.

## భారీవర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-తహసీల్దార్ భాస్కర్**



కాకివాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కర్, ఎస్సై దుర్గారెడ్డి

**కంగ్టి, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

కంగ్టి మండలంలో గత మూడురోజులుగా కురుస్తున్న భారీవర్షానికి గురువారం జంగి కె, అలాగే జంగి బికు తహసీల్దార్ భాస్కర్‌తోపాటు స్థానిక ఎస్సైదుర్గారెడ్డి వాగునుపరిశీలించారు. కాకివాగు ఉధృతి ఎక్కువగా ఉండడంతో స్థానిక ప్రజలు, వాగు దాటడానికి ప్రయత్నం చేయరాదని అత్యవసర పరిస్థితులో మాత్రమే బయటకురావాలని, ప్రజలకు సూచనలు చేసారు. అదేవిధంగా గ్రామాలలో పశువుల కాపరులు వాగులు దాటి వెళ్లరాదని, అవసరం వున్నచో స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి రిస్కు టీంని కూడా నియోజకవర్గంలో ఏర్పాటు చేసుకున్నారని, ప్రజలు కచ్చితంగా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జంగి గ్రామస్థులు అలాగే రెవిన్యూ, పోలీస్‌శాఖ సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో రెడ్ అలర్ట్



నారింజ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



చెరువును పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్



రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వాగు దృశ్యం



కురుస్తున్నగదిలో పనులుచేసుకుంటున్న అధికారులు



ప్రభుత్వపాఠశాల ప్రహరీగోడకూలి రోడ్డుమీదకొస్తున్న వరదనీరు



కూలిన ఇల్లు దృశ్యం



కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు



తెగిన మట్టిరోడ్డు దృశ్యం

**ప్రజలు పరేషాన్ కాకుండా చూడాలి**
**-ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు**

**జహీరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు పరేషాన్ కాకుండా చూసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. గురువారం కొత్తూరు శివారులోని నారింజ ప్రాజెక్టును ఎమ్మెల్యే పార్టీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. నీటి ఉధృతిని ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. విద్యుత్‌స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండకూడదన్నారు. ప్రమాదకరంగా మారిన వాగులు, వంకలు దాటకూడదన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, పాక్స్ ఐర్మన్ మచ్చేందర్, నాయకులు నామ రవికిరణ్, మాజీ పట్టణ అధ్యక్షులు మోహియోద్దిన్, మండల బిసి సెల్ అధ్యక్షులు అమిత్‌కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు హిరురాథోడ్, మాజీ సర్పంచ్‌లు కరణ్‌రాజ్, జగదీష్, శంకర్, కొత్తూర్ బిఆర్ఎస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, అరుణ్, పాప్‌నాథ్, భీమ్‌రావురాథోడ్, నవీన్‌తేజ, శశివర్ధన్‌రెడ్డి, బిఆర్ఎస్వి నాయకులు ఫయాజ్, యేసు, అతీఫ్, రౌఫ్, రాజు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**-అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయండి**
**-చెరువులను పరిశీలించిన జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్**

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించామని, అత్యవసరమైతేనే కాని ప్రజలు ప్రయాణాలు చేయాకూడదని జిల్లా ఎస్పి పరితోష్ పంజక్ సూచించారు. గురువారం జిల్లా ఎస్పి సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువును, హాస్టర్‌గడ్డ పయోనీర్‌స్కూల్ వేణుకళా గాలాకుంటా, సదాశివపేటలోని ఊబచెరువులను పరిశీలించారు. చెరువులు, కుంటలతో ఏదేని గ్రామంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయా అని ఇరిగేషన్ అధికారులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతులు తడి చేతులతో బోర్ మోటార్లు ఆన్‌చేయవద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, చెట్ల కింద నిల్చోవద్దన్నారు. అత్యవసరమైతే 100కు కాల్ చేయాలని జిల్లా ప్రజలకు సూచించారు. ఎస్పి వెంట సంగారెడ్డి డిఎస్పి సత్యయ్యగౌడ్, ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి పట్టణ ఇన్స్‌పెక్టర్ రమేష్, సదాశివపేట మున్సిపల్ కమిషనర్, ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

**భారీ వర్షాలు-రోడ్డెక్కిన చెరువులు కుంటలు**

**న్యాల్‌కల్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

అల్పపీడన ప్రభావంతో గత రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం తడిసి ముద్దయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు నిండుకుని పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని మెటల్‌కుంట-బసంత్‌పూర్ రోడ్డులోని చాకరివాగు, రేజింతల్-ఎల్గోయి రోడ్డులోని మామిడివాగు, డప్పూర్-వడ్డికట్ట మైసమ్మచెరువు, చాల్కి-చీకూర్తి రోడ్డులోని చౌటవాగులు ఉధృతంగా ఉరక లేస్తుండటంతో అటుగా ప్రయాణాలను అధికారులు నిలిపివేశారు. వరద ఉధృతి తగ్గాక ప్రయాణించాలని, సాహసించి ప్రమాదాలకు గురికావద్దని ప్రజలకు తహసీల్దార్ ప్రభులు, ఎస్ఐ దోమ సుజిత్‌లు సూచించారు.

**కురుస్తున్న మండల పరిషత్...**

**మనూర్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన మనూర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కురుస్తోంది. కార్యాలయంలోని గదుల పైకప్పు నుంచి నీరు కారుతున్నా అధికారులు తమ పనులు చేసుకోక తప్పడం లేదు. గదిపైనుంచి వర్షపునీరు టపటపమంటూ కంప్యూటర్లపై, కాగితాలపై పడుతుండటం, కార్యాలయం బయట చలితీవ్రత అధికంగా ఉండటం, కార్యాలయంలోని గదిలో తడిసిననేలపై పనులు చేసుకునేందుకు అధికారులు పడుతున్నపాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. మండలపరిషత్ భవనంనిర్మించి 3దశాబ్దాలు పూర్తవడంతో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీవర్షాలతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందో అని అధికారులు భయం గుప్పిట్లో పనులుచేసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి కురుస్తున్న మండల పరిషత్ కార్యాలయ భవనానికి మరమ్మతులు చేయించాలని అధికారులతో పాటు మండలప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు వినతి చేస్తున్నారు.

**కూలిపోయిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడ...**

**అల్లాదుర్గం, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ముప్పారం గ్రామం నుంచి అప్పాజీపల్లికి పోయే బిటి రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డు కొట్టుకుపోవడంతోపాటు రోడ్డుకు ఇరువైపుల పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహిస్తుండటంతో అటుగా ప్రయాణాలు ఆగిపోయాయి. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పక్కనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో పాఠశాల ప్రహరీగోడ కూలిపోయినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. పాఠశాలవైపు వచ్చే వరద ఉధృతిని వేరేవైపు మళ్లించాలని గ్రామస్థులు అధికారులకు వినతి చేస్తున్నారు. అతి భారీగాకురుస్తున్న వర్షాలను ఎప్పుడూచూడలేదని ప్రజలు చర్చించుకోవడం కానవచ్చింది.

**గూడు చెదిరింది.. గుండె పగిలింది...**

**నారాయణఖేడ్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నారాయణఖేడ్ మండల పరిధిలోని పైడిపల్లి గ్రామానికి చెందిన శత్రి సుశీలమ్మ భర్త శరణప్ప ఇల్లు వర్షానికి కూలిపోయింది. అదేవిధంగా కల్హేర్ మండలం ఖానాపూర్ కె గ్రామానికి చెందిన ఉప్పరి లచ్చమ్మ భర్త పోచయ్య ఇల్లుసైతం కూలిపోవడంతో దిక్కుతోచనివిధంగా ఆకుటుంబాలున్నాయి. కూలీపనిచేసుకుని జీవనంసాగించే తమకు ఇల్లునిర్మించుకునే ఆర్థికస్తోమతలేదని అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

**కూలిన ఇళ్లను పరిశీలించిన కమిషనర్ జగ్జీవన్...**

**నారాయణఖేడ్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

కమిషనర్ జగ్జీవన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని 6,11,12 వార్డులలో గత రెండురోజులుగా కురుస్తున్న భారీవర్షానికి మున్సిపల్‌సిబ్బంది అప్రమత్తమై శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ముందస్తుగా ఇంటి యాజమాన్యానికి నోటీస్ ఇచ్చి తొలగించడం జరుగుతుంది. ఈకార్యక్రమంలో మాజీ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, మున్సిపల్ మేనేజర్, జక్క వెంకటశివయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు అధికారులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

**తెగిన మట్టి రోడ్డు... రాకపోకలు నిలిపివేత...**

**చిలిపిచెడ్, ఆగస్ట 28, ప్రభాతవార్త:**

గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షానికి చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్‌నుంచి ఎల్లకుంట తండాకి వెళ్లే మట్టిరోడ్డు కోతకుగురై నీటిప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈవిషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ సహదేవ్, ఎంపిఓ తిరుపతి, కార్యదర్శి అశోక్, ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనం తరం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**భారీవర్షానికి కూలిన ఇల్లు...**

**చిలిపిచెడ్, ఆగస్ట 28, ప్రభాతవార్త:**

భారీవర్షానికి చిలిపిచెడ్ మండలం చండూరు గ్రామంలో బ్రాహ్మణపల్లి భారతమ్మ, మాసాయిపల్లి లచ్చమ్మకు చెందిన ఇళ్లు పాక్షికంగా కూలిపోగా, మండల అధికారులు ఆ ఇళ్లను పరిశీలించి, వారు ఇతర ఇళ్లలో, ప్రభుత్వ పాఠశాల అంగన్‌వాడీ కేంద్రాలలో ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. ప్రభుత్వపరంగా నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించేందుకు కృషిచేయాలని అధికారులను కోరారు. తహసీల్దార్‌వెంట సహదేవ్, ఎంపిఓ తిరుపతి ఉన్నారు.

## శిథిలావస్థకు చేరిన ఇళ్ల కూల్చివేత



శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేయిస్తున్న మాజీ కౌన్సిలర్

**జోగిపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

గత రెండురోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీవర్షాలతో ఇళ్లు కూలే అవకాశం ఉండటంతో, అలాంటివాటిని గుర్తించి వాటిని కూల్చేస్తున్నారు. జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 13వవార్డులో మాజీ కౌన్సిలర్ రంగసురేష్‌గుప్త ఆధ్వర్యంలో వార్డులో పర్యటించి శిథిలావస్థకు చేరిన రెండు ఇళ్లను గురువారం కూల్చివేయించారు. అలాగే వార్డులో అపరిశుభ్రంగా ఉన్న పలుచోట్ల చెత్తను తొలిగించి మురికిలేకుండా చేయించారు. మున్సిపాలిటీ నుంచి జెసిబిని తెప్పించి ఈపని చేయించారు. పట్టణంలోని రెండోవార్డులో మాజీ కౌన్సింలర్ పిట్ల భాగ్యలక్ష్మిలక్షన్ ఆధ్వర్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి వాటిని కూల్చేందుకు చర్యలు చేపట్టారు. 12వవార్డులో మాజీ కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు ఆధ్వర్యంలో వర్షాలవల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తమపరిసరాలు పరిశుభ్రంగా ఉంచకోవాలని సూచించారు. అలాగే వార్డులో దోమలబెడద నివారణకు దోమలమందు పిచికారి చేయిస్తానని హామీ ఇచ్చారు.

## పెద్దచెరువు గండి పూడ్చివేత...



జెసిబితో పెద్దచెరువు గండిపూడుస్తున్న దృశ్యం

**కొల్చారం, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామ శివారులోని పెద్ద చెరువుకు ఏర్పడిన గండిని మంజీరా సొసైటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, డైరెక్టర్లు, గ్రామ రైతులు, ఇరిగేషన్ ఎఈ సమక్షంలో కట్టకు ఏర్పడిన గందిని డాక్టర్లతో మట్టిని తీసుకువచ్చి గండిని పూడ్చివేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు ఉన్నారు.

## వినాయకుడిని పూజించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

రామచంద్రారెడ్డి నగర్‌లోని తన నివాసంలో రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ విఘ్నేశ్వరుడిని వినాయకచవితిని పురస్కరించుకుని బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ముంపుప్రాంతాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 28, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ గ్రామంలో గ్రామ చెరువు నుండి వస్తున్న వరద టాకిడికి ముంపుకు గురైన వరి పొలాలను గ్రామస్తులతో కలిసి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోమండల యువత అధ్యక్షులు మచ్చేందర్ ముదిరాజ్, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ,బురుపల్లి సత్యం, బురుగుపల్లి సాయిలు, వడ్ల బ్రహ్మం, మైకోటి కేసయ్య, ఏసు, ఆవుటి దుర్గమ్మ ,ఆవుటి నరసింహులు, చాకలి గోపాల్, గైని ప్రశాంత్, గైని అశోక్, సంతుగొండ, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరులస్ఫూర్తితో యువత పోరాటాలుచేయాలి

**-సిపిఎం నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి యన్.రమేష్**



నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

**నారాయణఖేడ్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

సిపిఎం నారాయణఖేడ్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని నారాయణఖేడ్ సిపిఎం కార్యాలయంలో విద్యుత్ పోరాట అమరవీరుల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈసందర్భంగా నారాయణఖేడ్ సిపిఎం పార్టి కార్యదర్శి యన్.రమేష్ మాట్లాడుతూ ఉమ్మడిరాష్ట్రంలో చంద్రబాబుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మూడునెలలపాటు వీరోచితంగా పోరాటంజరిగిన క్రమంలో శాంతియుతంగా హైదరాబాద్ బషీర్‌బాగ్ ర్యాలీ నిర్వహిస్తున్న వారిపై పోలీసులతో కాల్పులు జరిపించి కామ్రేడ్ రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల ప్రాణాలుబలిగొన్న చరిత్ర హీనుడిగా తెలుగుదేశంపార్టీ చంద్రబాబునాయుడు మిగిలిపోయారని అన్నారు. నాటి విద్యుత్‌పోరాటం దేశవ్యాప్తంగా ఎంతో ప్రభావితం కలిగించిందని అన్నారు. ఈపోరాటంలో ప్రాణాలుబలి అయిన అమర వీరులు తెలుగురాష్ట్రాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కాంన్సీరాం పార్టీ నాయకులు సంతోష్ రాఘు స్వరాజ్ ప్రభు పాల్గొన్నారు.

## రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలి..

**-అధికారులకు ఆదేశాలు ఇచ్చిన ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**



కోతకుగురైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 28 ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ మండలం ర్యాకల్, చల్లగిద్దతండా గ్రామాల మధ్యలోగల రోడ్డు నిన్నటినుండి కురుస్తున్న భారీవర్షాలకు ఎగువప్రాంతం నుండి వచ్చిన వరదనీటికి కోతకుగురై ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది అని తెలిసిన వెంటనే ఆరోడ్డును గౌరవ శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోడ్డు నిర్మాణంలో ఫార్మేషన్ దశలో ఉండటం, అధిక వర్షంతో వరదనీటి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల కోతకు గురైందని తెలిపారు. అప్పుడే ఆర్‌ఎండ్‌బి ఎస్‌ఈ, కాంట్రక్టర్‌లతో మాట్లాడుతూ ఈరోడ్డు గుండా రవాణా అధికంగా జరుగుతుందని, కావున యుద్ధ ప్రాతిపదికన కోతకుగురైన ఈరోడ్డును మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సమస్య తన దృష్టికి రాగానే అత్యవసరంగా స్పందించి కోతకు గురైన రోడ్డును సందర్శించడమే కాకుండా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపిపి రమేష్‌చౌహన్, మాజీ మునిసిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపిటిసి పండరిరెడ్డి, కాంగ్రెస్‌నాయకులు బాణాపూర్ రాజు, పరశురాం, సురేష్, ఆర్‌ఎండ్‌బిబి ఎఈ శ్రీనివాస్, పంచాయతీకార్యదర్శి ఎండి మిస్కిన్, గ్రామపెద్దలు ఉన్నారు.